సమ్మె బాటలో వైద్యమిత్రలు

- 29 నుంచి సమ్మె చేపట్టనున్నట్లు సీఈఓకు నోటీసు
- డిమాండ్లు నెరవేర్చాలని వేడుకోలు
- ఎన్‌టీఆర్ వైద్యసేవ చికిత్సలపై తీవ్ర ప్రభావం



ఆరోగ్య సేవలో పని చేస్తున్న సిబ్బంది

పాణ్యం: ఆరోగ్య శ్రీ అంటేనే దివంగత ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖర రెడ్డి గుర్తుకొస్తారు. ప్రతి పేదవాడికి కార్పొరేట్ స్థాయిలో వైద్యం అందించాలనే ఉద్దేశంతో ఆరోగ్యశ్రీ పథకాన్ని తెచ్చారు. ఈ పథకం ద్వారా పేదవారికి ప్రైవేటు ఆస్పత్రుల్లో సైతం అత్యాధునిక వైద్య సేవలు అందిస్తున్నారు. ప్రయివేట్ ఆసుపత్రుల్లో ఆరోగ్యశ్రీ కింద చికిత్స చేయించుకునే వారి వివరాలు అప్లోడ్ చేసేందుకు ప్రత్యేకంగా సిబ్బందిని నియమించారు. వీరు ఆసుపత్రిలో ఏ రకమైన సమస్యకు ఎలాంటి చికిత్స ఉంటుందో తెలియజేసి అవసరమైన వారికి ఆరోగ్య శ్రీ కింద చికిత్స చేయించి ప్రభుత్వం మంజూరుచేసిన నగదును అందిస్తారు. ఇలా 17 సంవత్సరాలుగా ప్రజలకు సేవలు అందిస్తున్నారు. కూటమి ప్రభుత్వం ఏర్పడ్డాక ఆరోగ్యశ్రీ పథకం పేరును ఎన్టీఆర్ వైద్యసేవగా మార్చింది. ఈ క్రమంలో తమ న్యాయమైన డిమాండ్లపై కూటమి ప్రభుత్వం నుంచి ఎలాంటి స్పందన రాకపోవడంతో ఆరోగ్య మిత్రలు ఈ నెల 29 నుంచి సమ్మెకు పిలుపునిచ్చారు. దీంతో పథకం అమలు ప్రశ్నార్థకంగా మారే ప్రమాదం ఏర్పడింది. ఇదిలా ఉంటే కూటమి ప్రభుత్వం వచ్చినప్పటి నుంచి చిరుద్యోగులపై కక్షగట్టింది. ఒక్కో రంగంలో పనిచేసే కార్మికులపై కత్తి పెట్టి రోడ్డున పడేస్తూ వస్తోంది. ప్రస్తుతం వైద్యమిత్రలను తొలగించి ప్రయివేటుకు అప్పగించేందుకు సిద్ధమైనట్లు తెలుస్తోంది. ఈ పరిస్థితుల్లో ఎన్టీఆర్ వైద్య సేవ సిబ్బంది సమ్మెకు సిద్ధమవుతున్నారు.

ఆరోగ్య శ్రీకి పునాది వేసిన మహానేత

డబ్బు లేని కారణంగా పేదలు వైద్యసేవలకు దూరమై ప్రాణాలు కోల్పోయే పరిస్థితి రాకూడదని, ఒక్కరూపాయి లేకపోయినా కార్పొరేట్ ఆసుపత్రుల్లో సైతం నాణ్యమైన చికిత్స పొందేలా దివంగత ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖర రెడ్డి 2008 జులై 17న ఆరోగ్యశ్రీ పథకాన్ని ప్రవేశపెట్టారు. ఈ పథకంలో పనిచేసే వైద్యమిత్రలకు అప్పట్లో రూ.3500 వేతనం నిర్ణయించి జీతభత్యాలను ప్రారంభించారు. అలా 17 సంవత్సరాల పాటు ప్రజలకు సేవలందించిన సిబ్బంది ప్రస్తుతం తమ డిమాండ్ల సాధన కోసం సమ్మెకు సిద్ధమవుతున్నారు. కూటమి ప్రభుత్వం పేదల ఆరోగ్యం విషయంలో ఎంత నిర్లక్ష్యంగా వ్యవహరిస్తోందో అందరికీ తెలిసిందే. అయితే అందులో పనిచేసే వైద్య మిత్రలను తొలగించి ప్రయివేట్‌కు అప్పజెప్పేందుకు పావులు కదుపుతున్నట్లు సమాచారం. ప్రస్తుతం ఉమ్మడి జిల్లాలో వైద్య మిత్రలుగా 100 మందికి పైగా పనిచేస్తుండగా రాష్ట్రవ్యాప్తంగా 2500 మందికి పైగా సేవలందిస్తున్నారు. వైద్యమిత్రలందరూ సమ్మెలోకి వెళితే పేదలకు ఎన్టీఆర్ వైద్యసేవ పథకం కింద చికిత్సలు నిలిచిపోయే ప్రమాదం ఉంది.

వైఎస్సార్‌సీపీ పాలనలో ఆరోగ్యశ్రీ విస్తరణ

మహానేత వైఎస్ రాజశేఖరరెడ్డి మరణాంతరం వచ్చిన ముఖ్యమంత్రులు ఈ పథకాన్ని తుంగలో తొక్కారు. 2014–19 మధ్యకాలంలో చంద్రబాబు ప్రభుత్వం పథకాన్ని పేరు మార్చింది గానీ తగినంతగా నిధులు విడుదల చేయకుండా నిర్వీర్యం చేసింది. 2019లో వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం అధికారంలోకి రావడంతో ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆరోగ్య శ్రీ పథకాన్ని విస్తరించారు. ఆరోగ్య శ్రీలో 3254 జబ్బులకు చికిత్సలు చేసేలా రూపకల్పన చేశారు. అలాగే ఆరోగ్యశ్రీ వైద్య చికిత్స పరిమితి రూ.25 లక్షలకు పెంచారు. ఆరోగ్యశ్రీలో పని చేసే సిబ్బంది వేతనం రూ.1500 పెంచారు. ఎన్నికల ఫలితాల అనంతరం ప్రభుత్వం మారడంతో వైద్య మిత్రలు తమ డిమాండ్లు నెరవేర్చాలని కోరుతూ సమ్మెకు పిలుపునిచ్చారు. తమ న్యాయమైన డిమాండ్ల సాధన కోసం ఆరోగ్యశ్రీ సీఈఓకు సమ్మె నోటీసు అందించారు.

వైద్యమిత్రల డిమాండ్లు

రాష్ట్రవ్యాప్తంగా వైద్య మిత్రలుగా పనిచేస్తున్న 2500 మంది తమ డిమాండ్లను నెరవేర్చాలని ప్రభుత్వాన్ని కోరుతున్నారు. తమ జీతభత్యాలు పెంచాలని, జూనియర్ అసిస్టెంట్ క్యాడర్ కేటాయించాలని, చనిపోయిన ఆరోగ్యమిత్రల కుటుంబాలకు ఎక్స్‌గ్రేషియా ప్రకటించాలని కోరుతున్నారు. వీటిపై ప్రభుత్వం నుంచి ఎలాంటి స్పందన రాకపోవడతో ఈ నెల 29 నుంచి సమ్మెకు పిలుపునిచ్చారు. ఇప్పటికే ఎన్టీఆర్ వైద్య సీఈఓకు సమ్మె నోటీసు అందించినట్లు సమాచారం.

మాకు సమాచారం లేదు

వైద్యమిత్రల సమ్మెకు సంబంధించి మాకు ఎలాంటి సమాచారం లేదు. ఉన్నతాధికారుల నుంచి ఎలాంటి లిఖితపూర్వక ఆదేశాలు అందలేదు. ఈ నెల 29 నుంచి ఆరోగ్య మిత్రలు సమ్మె చేస్తారంటూ పలు పత్రికల్లో వార్తలు వచ్చిన విషయం మాత్రమే తెలుసు. ఉన్నతాధికారుల నుంచి ఎలాంటి ఆదేశాలు వచ్చినా వారికి తెలియజేస్తాం.

– రూపేంద్రనాథ్ రెడ్డి, నంద్యాల జిల్లా సమన్వయ అధికారి, ఎన్టీఆర్ వైద్య సేవ

క్లుప్తంగా

రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపిక


విద్యార్థులను అభినందిస్తున్న ప్రిన్సిపాల్ జోషిలావాట్

ఓర్వకల్లు: స్థానిక మోడల్ స్కూల్‌కు చెందిన విద్యార్థులు రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికైనట్లు ఫిజికల్ డైరెక్టర్ శేఖర్ సోమవారం తెలిపారు. ఇటీవల కర్నూలు ఔట్ స్టేడియంలో నిర్వహించిన జిల్లాస్థాయి క్రీడాంశాలలో పాఠశాలకు చెందిన పలువురు విద్యార్థులు ప్రతిభ కనబరచినట్లు చెప్పారు. రెజ్లింగ్‌లో జితేంద్ర నాయుడు, హరికృష్ణ, హ్యాండ్‌బాల్‌లో జీవన్, కబడ్డీలో కిరణ్, క్రికెట్‌లో సందీప్, త్రోబాల్‌లో మహిత రాష్ట్రస్థాయికి ఎంపికైనట్లు తెలిపారు. ఎంపికైన క్రీడాకారులను ప్రిన్సిపాల్ జోషలావాట్, ఉపాధ్యాయులు అభినందించారు. అదే విధంగా ఆయా క్రీడాంశాలలో విద్యార్థులను ప్రతిభావంతులుగా తీర్చిదిద్దిన ఫిజికల్ డైరెక్టర్ శేఖర్‌ను ప్రశంసించారు.

భోగేశ్వర స్వామికి మహా రుద్రాభిషేకం


పూజలందుకుంటున్న భోగేశ్వరస్వామి

గడివేముల: మండల పరిధిలోని గడిగరేవుల గ్రామంలో కొలువైన దక్షిణ కాశీగా ప్రసిద్ధి చెందిన దుర్గా భోగేశ్వర స్వామి వారి సన్నిధిలో సోమవారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయ ప్రధాన అర్చకులు శ్యామ్ సుందర్ శర్మ ఆధ్వర్యంలో సోమవారం ఉదయం భోగేశ్వర స్వామికి మహా రుద్రాభిషేకం, అష్ట విధ మహా మంగళ హారతులు, మంత్రపుష్పం పూజలు చేపట్టారు. అమ్మవారికి కుంకుమార్చన పూజలు జరిపారు. భక్తులు పెద్దసంఖ్యలో అమ్మవారిని దర్శించుకున్నారు.

త్రైత సిద్ధాంత భగవద్గీతపై ప్రచారం


చిన్నటేకూరులో త్రైత సిద్ధాంత భగవద్గీతను ప్రచారం చేస్తున్న దృశ్యం

కల్లూరు: ఆచార్య ప్రబోధానంద యోగీశ్వరుల స్వామి దివ్య ఆశీస్సులతో చిన్నటేకూరు గ్రామంలో త్రైత సిద్ధాంత ప్రబోధ సేవా సమితి ఇందూ జ్ఞాన వేదిక కల్లూరు కమిటీ సభ్యులు త్రైత సిద్ధాంత భగవద్గీత, అనుబంధ గ్రంథాల పరిచయ కార్యక్రమాన్ని నిర్వహించారు. కార్యక్రమంలో కల్లూరు కమిటీ అధ్యక్షుడు, సభ్యులు పురుషోత్తం, ఓబులేసు, ఈశ్వరయ్య, హర్షవర్ధన్, మద్దిలేటి, వరలక్ష్మి, శ్రీదేవి పాల్గొన్నారు.

ఆయాలకు ఉద్యోగ భద్రత కల్పించాలి


ఎంఈఓ కార్యాలయం వద్ద ధర్నా చేస్తున్న ఆయాలు

కర్నూలు (రూరల్): పాఠశాలల్లో పనిచేస్తున్న ఆయాలకు ఉద్యోగ భద్రత కల్పించాలని సీఐటీయూ నాయకులు కోరారు. పాఠశాలలు, కళాశాలల్లో పనిచేస్తున్న ఆయాల రాష్ట్రవ్యాప్త నిరసనలో భాగంగా సోమవారం కర్నూలు అర్బన్ మండల ఆయాల నిరసన కార్యక్రమంలో సీఐటీయూ జిల్లా కార్యదర్శి పాల్గొని మాట్లాడారు. రాష్ట్రవ్యాప్తంగా 1600 మంది ఆయాలు గత ఆరు సంవత్సరాలుగా పనిచేస్తున్నారని కూటమి ప్రభుత్వం వారిని వేధిస్తూ, కొన్ని చోట్ల తొలగింపులు చేస్తున్నారని మండిపడ్డారు. అలాగే ఐదు నెలలుగా వేతనాలు పెండింగ్‌లో ఉన్నాయని వాపోయారు. ఆయాల యూనియన్ జిల్లా నాయకురాలు ఉరుకుందమ్మ మాట్లాడుతూ.. ఆయాలకు జాబ్ చార్టు ఏర్పాటు చేయాలని కోరారు. రూ.12 వేలు వేతనం, గుర్తింపు కార్డులు ఇవ్వాలని, ఉద్యోగ భద్రత కల్పించాలనే డిమాండ్లతో నవంబర్ 25న కలెక్టరేట్ వద్ద చేపట్టనున్న దీక్షలను జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు. ఆయాలు పాల్గొన్నారు.

రూ.10 నాణేలను నిర్భయంగా వినియోగించవచ్చు

కర్నూలు(అగ్రికల్చర్): రూ.10 నాణేలు చట్టబద్ధమైనవని, రోజువారి లావాదేవీలకు నిర్భయంగా వినియోగించవచ్చని బ్యాంకు ఆఫ్ బరోడా కర్నూలు శాఖ చీఫ్ మేనేజర్ సుబ్బరాయుడు తెలిపారు. రిజర్వుబ్యాంక్ ఆఫ్ ఇండియా ఆదేశాల మేరకు బీటీబీ రూ.10 నాణేల వినియోగంపై అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తోందని ఆయన పేర్కొన్నారు. సోమవారం రాజ్‌విహార్ సమీపంలోని బ్యాంకు ఆఫ్ బరోడా కరెన్సీ చెస్ట్‌లో జరిగిన అవగాహన కార్యక్రమాల్లో భాగంగా వివిధ దుకాణాల నిర్వాహకులు 45 మంది రూ.5 వేల మొత్తానికి సరిపడా రూ.10 నాణేలు అందచేశారు. చీఫ్ మేనేజర్ మాట్లాడుతూ.. నాణేలను అన్ని దుకాణాలు, బ్యాంకులు ఆమోదిస్తాయని పేర్కొన్నారు.

బాధిత కుటుంబానికి ఆర్థిక సాయం


ఆర్థిక సాయం అందజేస్తున్న కాటసాని రాంభూపాల్‌రెడ్డి

కల్లూరు: అర్బన్ 29వ వార్డు పరిధిలోని పందిపాడు గ్రామంలో కంసలి వీధికి చెందిన ఉగ్గన్న వ్యాపారం కోసం శ్రీశైలం నుంచి వస్తుండగా ఘాట్ సెక్షన్‌లో ప్రమాదవశాత్తు మరణించాడు. విషయం తెలుసుకున్న వైఎస్సార్‌సీపీ నంద్యాల జిల్లా అధ్యక్షుడు, మాజీ ఎమ్మెల్యే కాటసాని రాంభూపాల్‌రెడ్డి బాధిత కుటుంబానికి రూ.25 వేలు ఆర్థిక సహాయంను సోమవారం అందజేశారు. కార్పొరేటర్ నారాయణరెడ్డి, నాయకులు భీమేశ్వరరెడ్డి, శివశంకర్‌రెడ్డి, తిరుమలేష్ గౌడ్, చిన్న సుంకన్న, బాలు, శేషు తదితరులు ఉన్నారు.

టెట్‌కు 35 మంది గైర్హాజరు

పాణ్యం: నియోజకవర్గంలో టెట్ పరీక్షలు పకడ్బందీగా జరుగుతున్నాయి. మండలంలోని నెరవాడ మెట్ట వద్ద ఉన్న ఆర్‌జీఎం ఇంజినీరింగ్ కళాశాలలో సోమవారం జరిగిన టెట్ పరీక్షలకు 35 మంది గైర్హాజరయ్యారని ఎంఈఓ–2 సుబ్రమణ్యం తెలిపారు. ఆయన మాట్లాడుతూ.. ఉదయం 160 మందికిగాను 125 మంది హాజరు కాగా 35 మంది గైర్హాజరైనట్లు చెప్పారు. పరీక్ష కేంద్రాల వద్ద పకడ్బందీ బందోబస్తు నిర్వహిస్తున్నట్లు వెల్లడించారు.

సాగునీటి సంఘాల ఎన్నికలపై కసరత్తు


ఓటరు జాబితాపై సిబ్బందికి సూచనలిస్తున్న తహసీల్దార్ వెంకటేష్ నాయక్

కోడుమూరు రూరల్: త్వరలో జరగనున్న సాగునీటి సంఘాల ఎన్నికలకు సంబంధించి అర్హులైన రైతుల ఓటరు జాబితాను పకడ్బందీగా రూపొందించాలని కోడుమూరు తహసీల్దార్ వెంకటేష్ నాయక్ సిబ్బందిని ఆదేశించారు. సోమవారం తహసీల్దార్ కార్యాలయంలో మండలంలోని వీఆర్వోలు, సిబ్బందితో సాగునీటి సంఘాల ఓటరు జాబితాపై సమీక్షించారు. ఆయన మాట్లాడుతూ ఎల్లెల్సీ ఆయకట్టు కింద ప్యాలకుర్తి, అమడగుంట్ల, అనుగొండ, ఎర్రదొడ్డి, కోడుమూరు, వర్కూరు, పులకుర్తి, లద్దగిరి గ్రామాల రైతులుండగా, జీడీపీ ఆయకట్టు కింద ముడుమలగుర్తి, కోడుమూరు, వర్కూరు, గోరంట్ల రైతులు ఉన్నారన్నారు. ఆయకట్టు పరిధిలో పొలాలుండడంతో పాటు, ఆన్‌లైన్‌లో పేర్లున్న రైతుల వివరాలు ఓటరు జాబితాలో ఉండేలా చూసుకోవాలని చెప్పారు. సాధ్యమైనంత త్వరగా పొరపాట్లకు తావులేకుండా ఓటరు జాబితాను తయారు చేయాలని ఆదేశించారు. రీసర్వే డీటీ కృష్ణమూర్తి, మండల సర్వేయర్ సునీల్, వీఆర్వోలు పాల్గొన్నారు.

ప్రజా సమస్యల పరిష్కారమే లక్ష్యం


మాట్లాడుతున్న ఎమ్మెల్యే గౌరు చరితారెడ్డి

కల్లూరు: ప్రజా సమస్యల పరిష్కారమే లక్ష్యమని పాణ్యం ఎమ్మెల్యే గౌరు చరితారెడ్డి అన్నారు. సోమవారం బీసీ స్టడీ సర్కిల్‌లో ఎంపీడీఓ నాగశేషాచలరెడ్డి ఆధ్వర్యంలో ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా కల్లూరు గ్రామీణ ప్రాంతాలకు చెందిన ప్రజలు తమ సమస్యలను పరిష్కరించాలని వినతి పత్రాలు అందజేశారు. మొత్తం 113 అర్జీలు వచ్చాయి. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. ప్రజల నుంచి వచ్చిన ప్రతి అర్జీని పరిష్కరిస్తామన్నారు. వివిధ సమస్యలపై ప్రజలు ఇచ్చిన అర్జీలను సకాలంలో పరిష్కరించాలని ఆయా శాఖలకు చెందిన అధికారులను ఆదేశించారు. కార్యక్రమంలో తహసీల్దార్ ఆంజనేయులు, మండల స్థాయి అధికారులు, ఏపీ ఫైనాన్స్ అర్బన్ డెవలప్‌మెంట్ డైరెక్టర్ రామాంజనేయులు తదితరులు పాల్గొన్నారు.

ప్రకృతి వ్యవసాయంతో ఆరోగ్యకర దిగుబడులు


ప్రకృతి వ్యవసాయ ఉత్పత్తులను పరిశీలిస్తున్న అధికారులు

ఓర్వకల్లు: ప్రకృతి వ్యవసాయ పద్ధతిలో పండించిన పంట ఉత్పత్తులను వినియోగించడం వల్ల ప్రజలు సంపూర్ణ ఆరోగ్యంతో ఉంటారని ప్రకృతి వ్యవసాయం జిల్లా ప్రాజెక్టు మేనేజర్ చంద్రశేఖర్ అన్నారు. సోమవారం స్థానిక మండల పరిషత్ సమావేశం భవనంలో రైతులు ప్రకృతి వ్యవసాయ పద్ధతిలో పండించిన ఆకుకూరలు, కూరగాయలు, జొన్న, సజ్జలు వంటి ఉత్పత్తులను ప్రదర్శించారు. వీటిని డీఎల్‌ఎంపీ లక్ష్మయ్య, ఎంపీడీఓ శ్రీనివాసులు పరిశీలించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. ప్రకృతి వ్యవసాయం చేయడం వల్ల రైతులకు, నేలకు, పర్యావరణానికి లాభం చేకూర్చుతుందని పేర్కొన్నారు. ప్రజలు రోగాల బారిన పడకుండా, దీర్ఘకాలంలో పర్యావరణం దెబ్బతినకుండా, భవిష్యత్ తరాలకు ఆరోగ్యకరమైన ప్రకృతిని అందించే దిశగా కృషి చేయాలని సూచించారు. ప్రకృతి వ్యవసాయంలో గోమూత్రం, పశువుల పేడ, వేపాకులు, స్థానిక వనరులతో తయారు చేసిన ఘనజీవామృతం, ద్రవ బీజామృతం, బీజామృతం, నీమాస్త్రం, అగ్నాస్త్రం, బ్రహ్మాస్త్రం వంటివి వాడడం వల్ల నేలలో జీవ పదార్థం, భూసారం పెరిగి, మొక్కలు పెరగడానికి అవసరమైన పోషకాలు పెరుగుతాయన్నారు. ఈఓఆర్డీ సుబ్బరాయుడు, ఏపీఓ కుమార్‌సాయినాథ్, ఏపీఎం వెంకటరామిరెడ్డి, ఎంపీపీ తిప్పన్న, పంచాయతీ కార్యదర్శి నాగరాజు, ఎంఎంటీఎల్ వంశీకృష్ణ మార్కెటింగ్ సిబ్బంది, ప్రకృతి వ్యవసాయ సిబ్బంది పాల్గొన్నారు.

పీజీఆర్‌ఎస్ సమస్యలను పరిష్కరించండి

సి.బెళగల్: ప్రజా సమస్యల పరిష్కారవేదికలో ఇచ్చిన అర్జీలను మండల అధికారులు ఎప్పటికి అప్పుడు పరిష్కరించాలని తహసీల్దార్ శ్రీనివాసులు సూచించారు. సోమవారం స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో తహసీల్దార్ మండల అధికారులతో కలిసి ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమం నిర్వహించారు. పలు గ్రామాలకు చెందిన ప్రజలు తమ సమస్యలను పరిష్కరించాలని అధికారులకు అర్జీలు అందజేశారు. మారందొడ్డి గ్రామానికి చెందిన రైతులు భూ సమస్యలపై తహసీల్దార్‌కు అర్జీ ఇచ్చారు. ఎంపీడీఓ రాణెమ్మ, ఏఓ మల్లేష్‌కుమార్, హౌసింగ్, విద్యుత్, ఆర్‌డబ్ల్యూఎస్, పీఆర్ ఏఈలు సుమంత్, సుకుమార్, గోనేనాయక్, వెంకటప్రకాష్, ఎంఈఓ జ్యోతి, ఏపీఎం రామేశ్వర్, ఐసీడీఎస్ సూపర్‌వైజర్ మల్లేశ్వరి ఉన్నారు.

ఈరోజు

నేడు గ్రామసభ

కోడుమూరు రూరల్: రీసర్వే పూర్తయిన గ్రామాల్లో నెలకొన్న భూసమస్యల పరిష్కారంలో భాగంగా మంగళవారం పులకుర్తిలో గ్రామసభ నిర్వహిస్తున్నట్లు తహసీల్దార్ వెంకటేష్ నాయక్ సోమవారం తెలిపారు. గ్రామ సభలో రీసర్వే డీటీ, మండల సర్వేయర్, గ్రామ వీఆర్వో, సర్వేయర్ పాల్గొంటారని, సమస్యలున్న రైతులంతా సభలో పాల్గొని అర్జీలు అందజేస్తే పరిష్కారానికి చర్యలు తీసుకుంటామని చెప్పారు.

సి.బెళగల్: మండలంలోని పోలకల్ గ్రామంలో మంగళవారం గ్రామ సభ నిర్వహిస్తామని తహసీల్దార్ శ్రీనివాసరెడ్డి సోమవారం ఓ ప్రకటనలో తెలిపారు. రీ సర్వేలో తలెత్తిన భూ సమస్యల పరిష్కారం కోసం పోలకల్ గ్రామంలోని సంత బజారు పాత పంచాయతీ కార్యాలయంలో ఉదయం నుంచి సాయంకాలం వరకు సభ నిర్వహిస్తామని పేర్కొన్నారు. భూ సమస్యలున్న రైతులు అర్జీలు అందజేస్తే పరిష్కారానికి కృషి చేస్తామన్నారు.

నేటి నుంచి రెవెన్యూ సదస్సులు

గడివేముల: మండల పరిధిలో రీసర్వే పూర్తైయెన గ్రామాల్లో భూ సమస్యలను పరిష్కరించేందుకు మంగళవారం నుంచి రెవెన్యూ సదస్సులు నిర్వహించనున్నట్లు తహసీల్దార్ వెంకటరమణ తెలిపారు. సోమవారం స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో ఆయన మాట్లాడుతూ.. నేటి నుంచి ఈ నెల 30వ తేదీ వరకు రైతుల నుంచి రీసర్వే అభ్యంతరాలు, ఫిర్యాదులను స్వీకరించేందుకు అధికారులు అందుబాటులో ఉంటారన్నారు. 22న బూజునూరు, 23న దుర్వేశి, 24న గడివేముల, 25న కరిమద్దెల, 26న కొరటమద్ది, 29న మంచాలకట్ట, 30న పెసరవాయి గ్రామాల్లో సదస్సులు ఉంటాయన్నారు. ప్రజలు భూసమస్యలపై అర్జీ రూపంలో సమర్పించాలని కోరారు.

పాణ్యం: మండలంలో మంగళవారం నుంచి రెవెన్యూ సదస్సులు ప్రారంభమవుతున్నట్లు తహసీల్దార్ నరేంద్రనాథ్‌రెడ్డి తెలిపారు. ఆయన మాట్లాడుతూ రీసర్వేపై ఏమైనా అభ్యంతరాలుంటే భూయజమానులు అర్జీలు ఇవ్వొచ్చన్నారు. 22న ఆలమూరు, 23న అనుపూరు, 24న చిలకల, 25న గోనవరం, 26న గోరుకల్లు, 29న కొండజుటూరు, 30న కొణిదేడు, 1న కౌలురు, 2న మద్దూరు, 3న నెరవాడ, 4న పిన్నాపురం, 5న కొత్తూరు, 8న తమ్మరాజుపల్లె, 12న తొగర్చేడులో గ్రామ సభలు నిర్వహించనున్నట్లు చెప్పారు.

నేడు పొలం పిలుస్తోంది

సి.బెళగల్: మండలంలోని రెండు గ్రామాల్లో మంగళవారం పొలం పిలుస్తోంది కార్యక్రమం నిర్వహిస్తామని మండల వ్యవసాయ అధికారి మల్లేష్‌కుమార్ సోమవారం ఓ ప్రకటనలో తెలిపారు. ఉదయం స్థానిక రైతు సేవా కేంద్రం – 2, మధ్యాహ్నం చింతమానుపల్లె గ్రామంలో కార్యక్రమం ఉంటుందని పేర్కొన్నారు. ఆయా గ్రామాల రైతులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

అయోడిన్ లోపంతో థైరాయిడ్ వ్యాధి


విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్న హేమలత


అయోడిన్‌పై విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్న వైద్యాధికారి శ్రీమంత్‌మాదన్న

ఓర్వకల్లు: అయోడిన్ లోపంతో థైరాయిడ్ వ్యాధి సంక్రమిస్తుందని రాష్ట్రీయ బాల్య స్వాస్థ్య జిల్లా అధికారిణి హేమలత అన్నారు. సోమవారం మండలంలోని నన్నూరు ప్రాథమిక ఆరోగ్య కేంద్రం ఆధ్వర్యంలో స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో అయోడిన్ లోప వ్యాధుల నివారణ దినోత్సవం సందర్భంగా విద్యార్థులకు అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా హేమలత మాట్లాడుతూ.. అయోడిన్ లోపంతో వచ్చే రుగ్మతుల గురించి ప్రతి ఒక్కరు అవగాహన కలిగి ఉండాలన్నారు. అయోడిన్ లోపం వల్ల చిన్నారులలో ఎదుగుదల లోపించడం, బుద్ధి మాంద్యం, పెద్దల్లో థైరాయిడ్ సమస్యలు వస్తాయని పేర్కొన్నారు. వైద్యాధికారి నాగరాజు మాట్లాడుతూ.. మనుషుల శారీరక పెరుగుదలకు, అభివృద్ధి, మానసిక వృద్ధి, గర్భస్థ పిండం, చిన్న పిల్లల్లో మెదడు ఎదుగుదలకు, తెలివితేటలకు అయోడిన్ దోహదపడుతుందని వివరించారు. గర్భవతులు తీసుకునే ఆహారంలో అయోడిన్ లేకపోతే మంద బుద్ధి, వినికిడి లోపం, మూగతనం వంటి సమస్యలతో పిల్లలు పుట్టవచ్చని చెప్పారు. కొన్ని సార్లు గర్భస్రావం కలిగే ప్రమాదం ఉంటుందన్నారు. ముఖ్యంగా గర్భిణులు, చిన్న పిల్లలు అయోడిన్ కలిగిన ఉప్పునే వాడాలన్నారు. ఫ్లోరోసిస్ కన్సల్టెంట్ డాక్టర్ సుధాకర్ మాట్లాడుతూ.. అయోడిన్ కలిగిన ఉప్పుకు త్వరగా ఆవిరయ్యే గుణం ఉంటుందన్నారు. ఎండ వేడిమి, గాలి తగలకుండా జాగ్రత్త తీసుకోవాలి, అలాగే అయోడిన్‌ని గాలి చొరబడని మూత ఉన్న డబ్బాలో నిల్వ చేయాలని సూచించారు. కార్యక్రమంలో డెమో శ్రీనివాసులు, డిప్యూటీ డెమో చంద్రశేఖర్‌రెడ్డి, హెచ్‌ఎం ప్రాణేష్ కుమార్, వైద్య ఆరోగ్య సిబ్బంది పాల్గొన్నారు.

అయోడిన్ లోపంతో అనర్థాలు

కోడుమూరు రూరల్: అయోడిన్ లోపం వల్ల అనేక మనిషిలో మానసిక రుగ్మతలు తలెత్తుతాయని కోడుమూరు పీహెచ్‌సీ వైద్యాధికారి శ్రీమంత్ మాదన్న తెలిపారు. సోమవారం పట్టణంలోని బాలుర హైస్కూల్, కేజీబీవీ విద్యార్థులకు అయోడిన్ లోపం వల్ల కలిగే అనర్థాలపై వైద్య సిబ్బంది అవగాహన కల్పించారు. వైద్యాధికారి మాట్లాడుతూ అయోడిన్ అనేది థైరాయిడ్ గ్రంధికి అవసరమైన సూక్ష్మ పోషకమన్నారు. అయోడిన్ లోపంతో పిల్లలు అభ్యసన సామర్థ్యాన్ని కోల్పోవడంతో పాటు, మానసిక ఎదుగుదల లోపిస్తుందన్నారు. మెడలో వాపునకు కారణమై గాయిటర్ వ్యాధి వస్తుందన్నారు. గర్భిణులకు గర్భస్రావం, తక్కువ బరువున్న పిల్లలు పుడతారని చెప్పారు. నివారణకు ప్రతి ఒక్కరూ అయోడిన్ ఉప్పు వాడాలని వైద్యాధికారి సూచించారు. కార్యక్రమంలో సూపర్ వైజర్ కమాల్ సాహెబ్, హెచ్‌ఎం రామచంద్రుడు, ప్రిన్సిపాల్ గౌసియాబేగం పాల్గొన్నారు.

ప్రజా సమస్యలు పట్టని అధికారులు


కోడుమూరు ఎంపీడీఓ కార్యాలయంలో ప్రజా సమస్యల పరిష్కార వేదికకు హాజరైన ఎంఈఓ

కోడుమూరు రూరల్: ప్రజాసమస్యల పరిష్కారం కోసం ప్రభుత్వం నిర్వహిస్తున్న ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమంపై మండల అధికారులు నిర్లక్ష్యం వహిస్తున్నారు. కార్యక్రమాన్ని గతంలో తహసీల్దార్ కార్యాలయంలో నిర్వహించేవారు. అక్కడ వీడియో కాన్ఫరెన్స్ సెట్టు పనిచేయడం లేదు. దీంతో రెండు నుంచి ప్రతి సోమవారం ఎంపీడీఓ కార్యాలయ సమావేశ భవనంలో కార్యక్రమం నిర్వహిస్తున్నారు. రెవెన్యూ కార్యాలయంలో తహసీల్దార్ ల్యాప్‌టాప్‌లో ద్వారా కార్యక్రమంలో పాల్గొంటున్నారు. అయితే ఎంపీడీఓ కార్యాలయంలో జరిగే పరిష్కార వేదికకు మొక్కుబడిగా 11గంటలకుపైనా ఒకరిద్దరు తప్ప మిగిలిన అధికారులు హాజరవడం లేదు. వచ్చినా ఇలా వచ్చి అలా సంతకాలు చేసి వెళ్లిపోతున్నారు. సోమవారం కోడుమూరు ఎంపీడీఓ కార్యాలయంలో జరిగిన ప్రజా సమస్యల పరిష్కార వేదికకు ఉదయం 11:10గంటలైనా ఎంఈఓ వసంతలక్ష్మి, ఎంపీడీఓ కార్యాలయ సిబ్బంది తప్ప ఏ అధికారి కూడా హాజరు కాలేదు. దీంతో వివిధ సమస్యలపై అర్జీలిచ్చేందుకు వచ్చిన ప్రజలు జిల్లా కేంద్రానికి వెళ్లిపోతున్నారు. అలాగే ఇక్కడ అర్జీలు ఎన్నిసార్లు ఇచ్చినా పరిష్కార చర్యలు తీసుకోవడం లేదని, అర్జీలిచ్చినట్లు రసీదులు కూడా ఇవ్వడం లేదని ప్రజలు మండిపడుతున్నారు. జిల్లా అధికారులు స్పందించి కార్యక్రమానికి మండల అధికారులంతా హాజరై.. సమస్యలు పరిష్కరించేలా చూడాలని కోరుతున్నారు.

బస్సు సౌకర్యం కల్పించాలి

కర్నూలు (సిటీ): ఓర్వకల్లు మండలం బొడ్డువానిపల్లె గ్రామానికి ఆర్టీసీ బస్సు సౌకర్యం కల్పించాలని జిల్లా ఎస్సీ, ఎస్టీ విజిలెన్స్ మానిటరింగ్ కమిటీ సభ్యులు బి.నాగరాజు, ఎంఆర్‌పీఎస్ ఓర్వకల్లు మండల విభాగం వర్కింగ్ ప్రెసిడెంట్ బొగ్గుల మహేంద్ర బాబు సోమవారం ఆర్టీసీ–2 డిపో మేనేజర్ సుధారాణికి వినతిపత్రం ఇచ్చారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. బొడ్డువానిపల్లె గ్రామానికి ఆర్టీసీ బస్సు సౌకర్యం లేక ప్రజలు చాలా ఇబ్బందులు ఎదుర్కొంటున్నారన్నారు. ఆర్టీసీ అధికారులు స్పందించి బస్సు సౌకర్యం కల్పించాలని కోరారు.

ఆసుపత్రిలోకి వెళ్లాలన్నా కష్టమే !


పాణ్యం సీహెచ్‌సీ ముందు అధ్వానంగా ఉన్న రోడ్డు

పాణ్యం: మండల కేంద్రంలోని ప్రభుత్వ సీహెచ్‌సీకి నిత్యం వందల సంఖ్యలో ప్రజలు వైద్య సిబ్బంది వెళుతుంటారు. ఆసుపత్రి గేటు వద్దకు చేరుకోగానే రోడ్డు అధ్వానంగా ఉండడంతో ఇబ్బందులు తప్పడం లేదు. చిన్నపాటి వర్షానికే ఆస్పత్రి ఆవరణలోని రోడ్డుపై గుంతలు, బురద ఏర్పడుతుండడంతో నిత్యం ద్విచక్ర వాహనదారులు ప్రమాదాలకు గురవుతున్నారు. దీంతో బాలింతలు, గర్భవతులు, వృద్ధులు, ద్విచక్ర వాహనదారులు భయాందోళన చెందుతున్నారు. ఎక్కడ కిందపడతామనే భయంతో ఆచితూచి అడుగులు వేస్తూ అతి కష్టం మీద ఆసుపత్రిలోకి వెళ్తున్నారు. అధికారులు చర్యలు తీసుకొని ఆస్పత్రి ఆవరణలో రోడ్డు ఏర్పాటు చేయాలని ప్రజలు కోరుతున్నారు.

వెంకటగిరిలో భారీ వర్షం

- వందలాది ఎకరాల్లో దెబ్బతిన్న ఉల్లి


వెంకటగిరిలో ఉల్లి పంటలో నిలిచిన వర్షపు నీరు

కోడుమూరు రూరల్: మండలంలోని వెంకటగిరి, ప్యాలకుర్తి, ఎర్రదొడ్డి, చిల్లబండ గ్రామాల్లో సోమవారం సాయంత్రం భారీ వర్షం కురిసింది. సుమారు గంటపాటు ఏకధాటిగా వర్షం కురవడంతో వెంకటగిరిలో వందలాది ఎకరాల్లో రైతులు సాగు చేసిన ఉల్లి పంట దెబ్బతినింది. వెంకటగిరి గ్రామంలో వర్షాధారంగా 2వేలకు పైగా ఎకరాల్లో రైతులు ఉల్లి పంట సాగు చేశారు. ప్రస్తుతం పంట చేతికి రావడంతో వారం రోజుల నుంచి 600కు పైగా ఎకరాల్లో రైతులు ఉల్లి పంటను పీకి మార్కెట్ తరలించేందుకు సిద్ధం చేస్తున్నారు. ఈ సమయంలో సోమవారం సాయంత్రం భారీ వర్షం కురవడంతో పొలాల్లో పీకి పెట్టిన ఉల్లి పంటలో నీళ్లు నిలిచి భారీగా దెబ్బతింది. అలాగే పొలాల్లో వర్షపు నీరు భారీగా నిలిచిపోవడంతో పం చేతికందకుండా పోతుందని రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.